క్లుప్తంగా

నేడు ప్రదోష పూజలు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటపల్లిలోని శ్రీ మంగళాదేవి సమేత పళ్లికొండేశ్వరాలయంలో సోమవారం సాయంత్రం నందీశ్వరునికి ప్రదోష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు నంది మండపంలోని నంది విగ్రహానికి పంచామృతాలతో అభిషేక పూజలు, అలంకరణ, మహా హారతి చేపడతామన్నారు. అనంతరం శివపార్వతుల ప్రాకారోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట ఎస్సీ కాలనీలోని గంగమ్మ ఆలయంలోని గంగమ్మ దేవతకు ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. గంగమ్మదేవతత విగ్రహానికి అభిషేకాలు చేసి, పూలతో అలంకరించారు. గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకుని, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. భారీసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో మృతుడి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి ఆదివారం ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి చెందిన అజయ్‌కుమార్(25) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు గున్నేరి కిషోర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి దహన సంస్కారాలకు రూ.10 వేల నగదును అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.

ప్రమాదకరంగా గుంత



తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని చియ్యావరం క్రాస్ వద్ద రోడ్డుపై పెద్ద గుంత ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయంలో రోడ్డుపై గుంత కనపడకపోవడంతో ద్విచక్రవాహనాలు, ఆటోలకు ప్రమాదాలు జరిగి గాయాలబారిన పడుతున్నారు. ఈ మార్గంలో అధిక సంఖ్యలో టిప్పర్‌లు మట్టి తోలడంతో ఈ గుంతలు ఏర్పడ్డాయి. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న గుంతలు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ గృహసారథి చంద్రశేఖర్ మృతి


కొనిదల చంద్రశేఖర్(ఫైల్)

పిచ్చాటూరు: గుండెపోటుతో మండలంలో ని వేలూరు గ్రామ వైఎస్సార్‌సీపీ గృహ సార థి కొనిదల చంద్రశేఖ ర్(48) హఠాన్మరణం చెందారు. బంధువుల కథనం మేరకు.. శనివారం ఉదయం చంద్రశేఖర్‌కు అనారోగ్యంగా ఉండడంతో చెన్నైలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయనకు ఆదివారం ఉదయం హఠాత్తుగా గుండెపోటు వచ్చింది. వైద్యులు చికిత్స అందించినా ఫలితం లేకపోవడంతో చంద్రశేఖర్ మరణించినట్లు ప్రకటించారు. సోమవారం ఉదయం 9 గంటలకు చంద్రశేఖర్ మృతదేహాన్ని స్వగ్రామమైన పిచ్చాటూరు మండలం వేలూరులో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

చుక్కల దుప్పిని కాపాడిన స్థానికులు


కుక్కల దాడి నుంచి దుప్పిని కాపాడిన ఐతేపల్లి గ్రామస్తులు

చంద్రగిరి: అడవి నుంచి తప్పిపోయి ఐతేపల్లిలోకి వచ్చిన చుక్కల దుప్పిని ఆదివారం కుక్కల బారి నుంచి స్థానికులు కాపాడారు. దీనిపై సర్పంచ్ భర్త అంజద్ ఖాన్ మాట్లాడుతూ చుక్కల దుప్పి అడవి నుంచి తప్పిపోయి గ్రామంలోకి వచ్చిందన్నారు. దాన్ని కుక్కలు వెంటాడుతుండగా రక్షించినట్లు పేర్కొన్నారు. దానికి ప్రథమ చికిత్సను అందించి తిరుపతి జూపార్కు అధికారులకు సమాచారం చేరవేశామన్నారు. అటవీశాఖ అధికారులు దుప్పిని స్వాధీనం చేసుకుని సురక్షితంగా అడవిలో వదిలిపెట్టారు. ఈ సందర్భంగా అటవీ అధికారులు గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్నతోనే సంక్షేమం సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, హాజరైన సచివాలయ కన్వీనర్లు

శ్రీకాళహస్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం సాధ్యమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా నూతనంగా తయారు చేసిన కరపత్రాల్లో ఉన్న విషయాలను వివరించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో జరిగిన మోసపు హామీలు, వైఫల్యాలను వివరించారు. మన జగనన్న పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని తెలియజేశారు. రాజకీయాలకు అతీతంగా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఎక్కడికి వెళ్లినా జగనన్న పరిపాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బియ్యపు పవిత్రారెడ్డి, నియోజకవర్గ సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం


బుచ్చినాయుడుకండ్రిగ: రోల్ నంబర్లు వేస్తున్న చీఫ్, డిపార్టుమెంట్ అధికారులు


పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థులు


ఏర్పేడు పాఠశాలలో గదుల వివరాలతో ఏర్పాటు చేసిన బోర్డు


పరీక్ష హాలులో సిద్ధం చేసిన డెస్కులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో సోమవారం నుంచి పదోతరగతి పరీక్షల కోసం గదులు, సౌకర్యాలను సిద్ధం చేసినట్లు ఏ, బీ పరీక్ష కేంద్రాల పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు దయాకర్‌రావు, మునిసుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో పరీక్ష రాయనున్న గదులను పరిశీలించి, ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 4 జెడ్పీ ఉన్నత పాఠశాల్లో, 3 ప్రైవేటు స్కూల్లో 10వ తరగతి చదువుతున్న 394 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. అనంతరం ఓఎంఆర్ పత్రాలు నింపే విధానం గురించి సూచనలు ఇచ్చారు. డిపార్టుమెంట్ అధికారులు శ్రీనివాసులు, వెంకటరమణ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

ఏర్పేడు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం నుంచి జరుగనున్న పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ ప్రేమలత తెలిపారు. ఈ ఏడాది మొత్తం 711 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని చెప్పారు. బండారుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 30 మంది విద్యార్థులు, కందాడు (51), పంగూరు(77), పల్లం(115), మునగలపాలెం(59), పాపానాయుడుపేట(132), ఏర్పేడు(106), వ్యాసాశ్రమం ఎయిడెడ్ (36), ప్రైవేటు పాఠశాలలు ఓం నారారాయణ (17), బాపూజీ విద్యా సంస్థలు (51), సాయిబ్రిలియెంట్(38) మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వివరించారు. సోమవారం తెలుగు పరీక్ష జరుగనుందని చెప్పారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు


డీకే శివకుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే


వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి, పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కర్ణాటక కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డీకే శివకుమార్, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారు ముందుగా రూ.5 వేలు రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బియ్యపు శ్రీవాణిరెడ్డి, పవిత్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తిరుచానూరుకు చెందిన ఉమశ్రీ బృందం కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. పుష్పాంజలి, మూషికవాహన, శాంతాకారం, శివతాండవం, శంభో శివ శంభో, ఘల్లుఘల్లు, ముద్దుగారే యశోద, ఓం శివోహం, జగడపు జగముల, గణణాయక, ఏరువాక, శ్రీమన్‌నారాయణ వంటి పాటలకు కళాకారులు భూమిజ, లవీష, భవిష్య, దీక్షిత, శ్రేష్ట, రిషిత, వర్ష, లక్షయ, భావిష చక్కగా నాట్యం చేశారు. వారిని ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

కంటి వైద్య శిబిరం


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని జైన్ మందిరంలో ఆదివారం తిరుపతికి చెందిన అరవింద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేశారు. కంటి అపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా చేయిస్తామని జైన్ సంఘం అధ్యక్షుడు కొఠారి రమేష్ తెలిపారు. ప్రతి నెలా ఒకటో ఆదివారం వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నేమిచంద్ గౌరవ్, పవన్‌కుమార్, సుధీర్, విజయ్, మనోజ్, వికాస్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం


ఏర్పేడులో రక్తదాన శిబిరం

ఏర్పేడు: ఏర్పేడు–వెంకటగిరి మార్గంలోని సంత మైదానంలో ఆదివారం యువసమాజ్ నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. 50 మంది రక్తదానం చేశారు. రుయా హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. సంస్థ ఫౌండర్ గానుగపెంట రమేష్, అధ్యక్షుడు తాళిక్కల్ వెంకటేశ్వర్లు రక్తదానం చేసిన వారిని అభినందించారు. సంస్థ సభ్యులు, రుయా ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో శెట్టిపల్లి విలీనం

- మంగళం హెడ్‌క్వార్టర్‌గా నాలుగు గ్రామాలు
- కలెక్టర్ వెంకటరమణారెడ్డి వెల్లడి

తిరుపతి అర్బన్: తిరుపతి అర్బన్‌లో కొంత భాగం, తిరుపతి రూరల్‌లో కొంతభాగంగా ఉన్న శెట్టిపల్లి పంచాయతీని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శెట్టిపల్లి పంచాయతీలోని శెట్టిపల్లి, శెట్టిపల్లి హరిజనవాడ, సీఆర్ఎస్ క్వార్టర్స్, ఉప్పరపాళెం, వినాయకనగర్ ప్రాంతాలు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వచ్చాయి. ఇప్పటికే తిరుపతి కార్పొరేషన్‌లో 50 డివిజన్లు ఉన్నాయి. శెట్టిపల్లిని మరో డివిజన్‌గా చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు మంగళం హెడ్ క్వార్టర్‌గా మిట్ట గాంధీపురం, మిట్టగాంధీపురం హరిజనవాడ, చెన్నాయగుంట ప్రాంతాలతో పంచాయతీగా ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక ప్రజలకు సౌకర్యవంతంగా ఉండడంతో అధికారుల ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం సానుకూలంగా ఉత్తర్వులు ఇచ్చినట్టు సమాచారం.

యువత క్రీడల్లో రాణించాలి


క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవంలో బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పిచ్చాటూరు: యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఆదివారం నాగలాపురంలో వీకేసీసీ క్రికెట్ టోర్నీని ఎమ్మెల్యే బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. అంతకుముందు తొలిమ్యాచ్‌లో ఎన్‌వైసీసీ–వీకేసీసీ జట్లు తలపడ్డాయి. అంతకుముందు ఎమ్మెల్యే టాస్ వేయగా ఎన్‌వైసీసీ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ టోర్నీలో విజేతగా నిలిచే జట్టుకు రూ.30 వేలు నగదు, కప్, ద్వితీయ బహుమతి రూ.20 వేలు నగదు, కప్, తృతీయ బహుమతి రూ.10 వేలుగా నిర్ణయించినట్లు నిర్వాహకులు తెలిపారు. వీటితో పాటు మ్యాన్ ఆఫ్ ది సిరీస్, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ బహుమతులు అందిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు, దేహదారుడ్యాన్ని పొందవచ్చన్నారు. క్రీడల నిర్వహణకు ప్రభుత్వ సహకారంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఆర్థికంగా చేయూత అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, జిల్లా సంయుక్త కార్యదర్శి మునిరత్నం, సభ్యులు సురేష్, ఎస్‌బి పురుషోత్తం రెడ్డి, నాయకులు అలగేశన్, దేశప్పన్, కులశేఖర్ రెడ్డి, మహేష్, దేశన్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


సిపాయి భరోసా అందజేసున్న ఎమ్మెల్సీ

రేణిగుంట: పట్టణానికి చెందిన మోహన్‌రెడ్డి కుటుంబానికి ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం సిపాయి భరోసా పేరుతో నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. రేణిగుంటకు చెందిన మోహన్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ క్రమంలో అతని కుటుంబానికి 44 రకాల పప్పు దినుసులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సదాశివరెడ్డి, రామిరెడ్డి, తిరుమలరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, బాల, మురుగన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం

- రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి
- అటుగా వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు గుర్తించిన ఎమ్మెల్యే ఆదిమూలం
- కాన్వాయ్ ఆపి, ఎస్కార్ట్ వాహనంలో క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలింపు

పిచ్చాటూరు: ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసి అటుగా వెళ్తున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తక్షణం స్పందించి క్షతగాత్రున్ని తన ఎస్కార్ట్ వాహనంలో ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. వివరాలు.. నాగలాపురం మండలం వేంబాక్కం ఎస్సీ కాలనీకి చెందిన కన్నయ్య(57) వ్యక్తిగత పనుల నిమిత్తం ఆదివారం మధ్యాహ్నం నాగలాపురం వచ్చాడు. ఆయన పెట్రోలు బంకు సమీపంలో కాలినడకన వెళ్తుండగా ఎదురుగా కృష్ణాపురం నుంచి నాగలాపురం వైపు వెళ్తున్న ఓ ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో కన్నయ్య తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే ద్విచక్రవాహనదారుడు నరేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అదే సమయంలో నాగలాపురంలో టోర్నీ ప్రారంభోత్సవానికి వస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రమాదం జరిగిన విషయం గుర్తించి, వెంటనే తనముందు వెళ్తున్న పోలీసు ఎస్కార్ట్ వాహనంలో క్షతగాత్రుడు కన్నయ్యను నాగలాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం 108లో నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే ప్రమాద బాధితుల పట్ల ఎమ్మెల్యే ఆదిమూలం స్పందించడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ హనీఫా తెలిపారు.

రైతు మునెయ్య కుటుంబాన్ని ఆదుకుంటాం


రైతు కుటుంబసభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం: మండలంలోని జ్ఞానమ్మకండ్రిగ గ్రామానికి చెందిన రైతు మునెయ్య(40) శనివారం ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. విషయం తెలిసి ఆ రైతు కుటుంబాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదివారం పరామర్శించారు. మృతుడి భార్యాబిడ్డల రోదనలు చూసి ఎమ్మెల్యే సైతం కంటతడి పెట్టారు. ప్రభుత్వం నుంచి వచ్చే సాయాన్ని త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మృతి చెందిన రైతు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇకపై ఏ ఒక్క రైతు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ప్రభుత్వం అన్నివిధాలా వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నప్పటికీ, ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన రైతు కుమారుల చదువులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గవర్ల కృష్ణయ్య, నందకుమార్, లాల్ బాబు యాదవ్ తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి


మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న రాధిక

రేణిగుంట: మహిళ ఆర్థికంగా పురోగతి సాధించినప్పుడే కుటుంబం అభివృద్ధిబాట పడుతుందని ఆకాంక్ష సంస్థ ముఖ్య సలహాదారు పేరం రాధికా కిరణ్ అన్నారు. మండలంలోని ఆర్.మల్లవరం ఎస్టీ కాలనీలో మహిళలకు కట్టు మిషన్లు పంపిణీ చేశారు. కుటుంబ పోషణలో ఇంటి పెద్దకు మహిళ కూడా తోడుగా పనిచేస్తే ఆర్థికంగా నిలదొక్కుకోగలరని అన్నారు. గ్రామీణ మహిళలకు కేవలం వ్యవసాయ పనులకే పరిమితం కాకుండా చేతివృత్తులను అలవాటు చేసుకుంటే జీవనోపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆకాంక్ష సంస్థ ప్రధాన కార్యదర్శి మర్థాల రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తెప్పోత్సవాలు

తిరుపతి కల్చరల్: కోదండరామస్వామి తెప్పోత్సవాలు సోమ, మంగళ, బుధవారాల్లో వేడుకగా నిర్వహించనున్నారు. స్వామి వారు ప్రతి రోజూ రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు శ్రీరామచంద్ర పుష్కరిణిలో తెప్పపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు. అదేవిధంగా ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు ఆలయ ఆవరణలో సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.

పుష్ప సోయగం

తిరుమలలోని పలు ప్రాంతాలలో భక్తులను కనులవిందు చేస్తున్న పుష్పాలు



విరబూసిన పుష్పాల వద్ద ఆనందంగా ఫొటోలు తీసుకుంటున్న భక్తులు




కలియుగ వైకుంఠం తిరుమలలోని ప్రతి వస్తువు, చెట్టు, చేమల్లోనూ ఆధ్యాత్మికత ఉట్టిపడుతుంది. ఇక్కడున్న పలు చెట్లు ఆకులు రాలిపోయి కొత్త చిగుర్లు వేశాయి. కొన్ని నిండుగా పూలతో పరిమళాలను వెదజల్లుతున్నాయి. రోడ్ల పక్కన, నందన వనాల్లో ఉన్న చెట్లు పూలతో నూతన శోభను సంతరించుకుని హొయలుపోతున్నాయి. వాటిని చూసి భక్తులు తన్మయత్వం చెందుతున్నారు. కొందరు సెల్ఫీలు, ఫొటోలు తీసుకుని మురిసిపోతున్నారు. – తిరుమల